


చెక్‌పోస్టులో లేని తనిఖీ సిబ్బంది

ప్రత్తిపాడు: ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో గుంటూరు జిల్లాలోకి వచ్చే వాహనాల తనిఖీకి ఏర్పాటైన పెదనందిపాడు చెక్ పోస్టు బుధవారం ఇలా సిబ్బంది లేకుండా దర్శనమిచ్చింది.



ఆకట్టుకున్న పుష్పప్రభ

రేపల్లెరూరల్: మహా శివరాత్రిని పురస్కరించుకుని రేపల్లె నుంచి గులాబీలు, చామంతులతో శివలింగాకృతిలో ప్రభను అరవపల్లి బాల కోటేశ్వరస్వామి తిరునాళ్లకు తరలించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం బుధవారం 531.30 అడుగుల వద్ద ఉంది. కుడి కాలువకు 7,033 క్యూసెక్కులు విడుదలవుతోంది.

న్యూస్‌రీల్

నేడు ప్రభుత్వ, ప్రైవేటు స్కూళ్లకు సెలవు

గుంటూరు ఎడ్యుకేషన్: కృష్ణా–గుంటూరు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల దృష్ట్యా గురువారం గుంటూరు జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక సెలవు ప్రకటించారు. ఆమె బుధవారం మీడియాతో మాట్లాడుతూ పట్టభద్రుల ఎన్నికల్లో ఓటు హక్కు కలిగిన గ్రాడ్యుయేట్లు అందరూ ఓటు హక్కు వినియోగించాల్సి ఉన్నందున విద్యాశాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అన్ని యాజమాన్యాల్లోని పాఠశాలలకు సెలవు ప్రకటిస్తున్నట్లు తెలిపారు. ఆయా విద్యాసంస్థల్లో పని చేస్తున్న బోధన, బోధనేతర సిబ్బందికి విధిగా సెలవు ఇచ్చి, గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునే విధంగా చూడాలని విద్యాసంస్థల యాజమాన్యాలకు సూచించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే ఆయా పాఠశాలల యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వైభవంగా ఆది దంపతుల కల్యాణోత్సవం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా, కనుల పండువగా జరిగింది. ఇంద్రకీలాద్రిపై మల్లేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై శ్రీ గంగాపార్వతి(దుర్గ) సమేత మల్లేశ్వర స్వామి వార్లకు ఆలయ అర్చకులు కల్యాణోత్సవాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు. ఆలయ స్థానాచార్య శివ ప్రసాద్ శర్మ, వైదిక కమిటీ సభ్యులు, వేద పండితులు పర్యవేక్షణలో ఈ వేడుక వైభవంగా జరిగింది. మహా శివరాత్రిని పురస్కరించుకుని అమ్మవారి ప్రధాన ఆలయంతో పాటు మల్లేశ్వర స్వామి వార్ల ఆలయాన్ని పూలతో విశేషంగా అలంకరించారు. మరో వైపు అమ్మవారి ఆలయం నుంచి మల్లేశ్వర స్వామి వారి ఆలయానికి చేరుకునే మార్గాన్ని సైతం పూలతో అలంకరించారు. ఆలయ ప్రాంగణాన్ని మామిడి తోరణాలు, అరటి చెట్లతో పచ్చటి పందిరిని తలపించేలా తీర్చిదిద్దారు. మల్లేశ్వర స్వామి వారికి త్రికాల అభిషేకాలు నిర్వహించారు. పవిత్ర కృష్ణానదిలో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు ఇంద్రకీలాద్రికి చేరుకుని స్వామిని దర్శించుకుని అభిషేకాలు జరిపించారు.

రాజధానిలో దొంగల కలకలం



తాడికొండ: రాజధాని ప్రాంతం తుళ్లూరు మండలం నెక్కల్లులోని పోలేరమ్మ ఆలయంలో జరిగిన చోరీ స్థానికంగా కలకలం రేపింది. సేకరించిన వివరాల ప్రకారం నెక్కల్లు గ్రామంలోని పోలేరమ్మ ఆలయంలోకి మంగళవారం అర్ధరాత్రి గుర్తుతెలియని దుండగులు గేట్లు పగులగొట్టి ప్రవేశించి అమ్మవారి వెండి వడ్డాణం, కిరీటం, హుండీలో నగదు, కానుకలు, అపహరించారు. చోరీ సొత్తు విలువ సుమారు రూ.2 లక్షలు ఉంటుందని అంచనా. ఆలయంలో ఉన్న సీసీ కెమెరాలు ధ్వంసం చేసి సమాచారం తెలియకుండా ఉండేందుకు బాక్సులు సైతం తీసుకెళ్లారు. మంగళవారం అర్ధరాత్రి ఈ ఘటన జరిగినట్లు స్థానికులు చెబుతున్నారు. పూజారి గుమ్మా గంగయ్య రోజు మాదిరిగానే బుధవారం ఉదయం పూజా కార్యక్రమాల నిర్వహణ నిమిత్తం దేవస్థానానికి రాగా ఆలయం గేటు, తాళం, హుండీ తాళం పగులగొట్టి ఉండటం, పోలేరమ్మ విగ్రహంపై ఉన్న నగలు కనిపించకపోవడంతో గ్రామస్తులకు సమాచారం అందించారు. స్థానికులు, ఆలయ కమిటీ సభ్యుల సహకారంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి

పట్నంబజారు: రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందిన ఘటన గుంటూరు నగరంలో చోటు చేసుకుంది. ఈస్ట్ ట్రాఫిక్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కాకాని రోడ్డులోని వేదాంత ఆసుపత్రి సమీపంలో బుధవారం రాత్రి ద్విచక్ర వాహనంపై నలుగురు వ్యక్తులు వెళుతున్న క్రమంలో ప్రమాదం జరిగింది. ప్రమాదం ఎలా జరిగింది, ఏ వాహనం ఢీకొందనే వివరాలు తెలియరాలేదు. ప్రమాదంలో ఎన్టీఆర్ నగర్‌కు చెందిన చల్లా వెంకటేష్ (15), లాలాపేటకు చెందిన షేక్ అబ్దుల్ అలీ (28) మృతి చెందారు. మరో ఇద్దరికి గాయాలు అయ్యాయి. పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని పోలీసులు పేర్కొన్నారు.



అందాల హరవిల్లు : విద్యుద్దీప కాంతుల్లో శోభిల్లుతున్న కోటప్పకొండ దివ్యక్షేత్రం అంతరచిత్రం కోటప్పకొండలో కొలువైన త్రికోటేశ్వరస్వామి దివ్యమంగళ స్వరూపం



అహరహం రక్షమాం

ప్రమదగణాలు ప్రణవనాదంతో పరవశించాయా.. జంగమదేవర శంఖారావంతో దిక్కులు పిక్కటిల్లాయా.. అభిషేక ప్రియుని సిగన కృష్ణాజలాలు ఆనంద తాండవమాడాయా.. వేదమంత్రోచ్చరణలకు లయబద్ధంగా గుడిగంటలు మార్మోగాయా.. అన్నట్టు.. మహాశివరాత్రి సందర్భంగా శైవక్షేత్రాలు ఆధ్యాత్మికోత్సాహంతో ఉప్పొంగాయి. జన హృదయాలు మనోహరుడి ముందు ప్రణమిల్లాయి. పాహిమాం.. అహరహం రక్షమాం.. అంటూ లయకారుడిని శరణువేడాయి.

- మదినిండా మనోహరుడు
- వైభవంగా మహాశివరాత్రి వేడుకలు
- ఉప్పొంగిన భక్తిపారవశ్యం
- పోటెత్తిన కోటప్పకొండ, శైవక్షేత్రాలు

సాక్షి, నరసరావుపేట, నరసరావుపేట రూరల్: ప్రముఖ శైవక్షేత్రం కోటప్పకొండ శ్రీ త్రికోటేశ్వరస్వామి దేవస్థానానికి మహాశివరాత్రి సందర్భంగా లక్షలాది మంది భక్తులు బుధవారం పోటెత్తారు. స్వామిని భక్తిశ్రద్ధలతో దర్శించుకున్నారు. తెల్లవారుజామున 3 గంటలకు బిందెతీర్థంతో స్వామికి అభిషేకాలు నిర్వహించారు. ఆలయ ఉప ప్రధాన అర్చకులు అప్పయ్యగురుకుల్ ఆధ్వర్యంలో అభిషేకం శాస్త్రోక్తంగా జరిపారు. ప్రత్యేక అలంకారం అనంతరం స్వామి దర్శనానికి భక్తులను అనుమతించారు. స్వామి దర్శనభాగ్యం కోసం అర్ధరాత్రి నుంచి భక్తులు క్యూలైన్లలో వేచి ఉన్నారు. ఫలితంగా క్యూలైన్లన్నీ కిటకిటలాడాయి. అభిషేక మండపంలో నిర్వహించిన అభిషేకాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. సోపాన మార్గం నుంచి భక్తులు మెట్ల పూజ చేసుకుంటూ కొండపైకి చేరుకున్నారు. ధ్యానశివుడు, నాగేంద్రుని పుట్ట, నంది విగ్రహం వద్ద భక్తులు పూజలు చేశారు. త్రిముఖ శివలింగం వద్ద యాత్రికులు సెల్ఫీలు తీసుకోవడం కనిపించింది. పలువురు భక్తులు కాలినడకన పాత కోటయ్య స్వామి ఆలయం వద్దకు చేరుకున్నారు. కొండ కింద నుంచి 65 సప్తగిరి బస్సుల్లో ఆర్టీసీ యాత్రికులను చేరవేసింది. ఘాట్‌రోడ్డులో ఎలాంటి ట్రాఫిక్ సమస్య లేకుండా పోలీసులు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు.

కోటయ్యకు పట్టువస్త్రాలు

సాక్షి, నరసరావుపేట: కోటప్పకొండపై వేంచేసిన త్రికోటేశ్వరుడికి రాష్ట్ర ప్రభుత్వం తరఫున రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి బుధవారం సాయంత్రం 6.30 గంటలకు పట్టువస్త్రాలను సమర్పించారు. ఆలయ అధికారుల, పూజారులు మంత్రికి స్వాగతం పలికారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రజలకు మహాశివరాత్రి శుభాకాంక్షలు తెలిపారు. కోటప్పకొండను పర్యాటకంగా అభివృద్ధి చేస్తామన్నారు. ఆగిపోయిన రోప్‌వే, గిరిప్రదక్షణ మార్గం అభివృద్ధి కార్యక్రమాలను ఆటవీశాఖతో సమన్వయం చేసుకుని చేపట్టాలని సీఎం చంద్రబాబు ఆదేశించారని వివరించారు. దేవదాయ శాఖ పరిధిలోని కొన్ని ఆలయాల నుంచి కోటప్పకొండ ఆలయం అప్పుగా తీసుకున్న సుమారు రూ.54.5 లక్షల బకాయిలను రద్దు చేస్తామని హామీనిచ్చారు. కార్యక్రమంలో నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్ బాబు, దేవదాయ శాఖ కమిషనర్ రామచంద్ర మోహన్, అడిషనల్ కమిషనర్ చంద్రకుమార్, డిప్యూటీ కమిషనర్ కేబీ శ్రీనివాస్, జిల్లా దేవదాయ శాఖ అధికారి అచ్యుత్, కోటప్పకొండ ఆలయ ఈవో చంద్రశేఖర రావు పాల్గొన్నారు.



క్వారీ బాలకోటేశ్వరస్వామి సన్నిధిలో భారీ విద్యుత్ ప్రభ

పెదకాకాని పరవశమాయె..



పెదకాకాని మల్లేశ్వరస్వామి మూలవిరాట్



పెదకాకాని శివాలయం ప్రాంగణంలో భక్తుల రద్దీ



పెదకాకానిలో స్వర్ణకవచాలంకృత భ్రమరాంబగా..

పెదకాకాని: పెదకాకాని శైవక్షేత్రం మహాశివరాత్రి సందర్భంగా బుధవారం భక్తజన పరవశంతో పులకించింది. రాష్ట్ర నలుమూలల నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చారు. భక్తుల కోసం ఆలయ డిప్యూటీ కమిషనర్ గోగినేని లీలాకుమార్ నేతృత్వంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అమ్మవారు స్వర్ణ కవచాలంకృత భ్రమరాంబదేవిగా భక్తులను అనుగ్రహించారు. స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, సేవలు నిర్వహించారు. గురువారం తెల్లవారుజామున స్వామి దివ్యకల్యాణోత్సవం వైభవంగా జరిగింది. బుధవారం ఒక్కరోజులో స్వామికి వివిధ సేవా కార్యక్రమాల ద్వారా 6,50,000 రూపాయల ఆదాయం సమకూరినట్టు ఆలయ వర్గాలు తెలిపాయి. బుధవారం రాత్రి కూచిపూడి నృత్య ప్రదర్శనలు భక్తులను ఆకట్టుకున్నాయి. హైకోర్టు న్యాయమూర్తులు గుణరంజన్, హరిహరనాథ్‌శర్మ, ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్, పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ తదితరులు స్వామిని దర్శించుకున్నారు. పెదకాకానిలో గురువారం స్వామి దివ్య రథోత్సవం జరుగుతుందని ఆలయ డీసీ గోగినేని లీలాకుమార్ తెలిపారు.

క్వారీ బాలకోటయ్య ఆలయం కిటకిట



క్వారీ దేవస్థానం వద్ద భక్తుల రద్దీ

చేబ్రోలు: మహాశివరాత్రి సందర్భంగా వడ్లమూడి క్వారీలోని బాలకోటేశ్వరస్వామి దేవస్థానం భక్తులతో పోటెత్తింది. బుధవారం తెల్లవారుజాము నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఆలయ ఆవరణకు 15 భారీ విద్యుత్ ప్రభలు చేరుకున్నాయి. వందల సంఖ్యలో చిన్న, బాల ప్రభలు తరలివచ్చాయి. స్వామి దర్శనానికి భక్తులు గంటల తరబడి క్యూలైన్లలో వేచి ఉన్నారు. ట్రైనీ ఐపీఎస్ దీక్ష ఆధ్వర్యంలో తెనాలి డీఎస్పీ జనార్దనరావు పర్యవేక్షణలో 12 మంది సీఐలు, 16 మంది ఎస్ఐలు, 300 మందికిపైగా పోలీసు సిబ్బందితో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.



బందోబస్తు ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ సతీష్ కుమార్, ట్రైనీ ఐపీఎస్ దీక్ష

ఎస్పీ సతీష్‌కుమార్ బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు. భక్తులకు ఆలయ సమీపంలో అన్నదానం చేశారు. ఆలయ ప్రాంగణం వద్ద పులిహోర, పొంగలి, లడ్డూ, మజ్జిగ పంపిణీ చేశారు.

ఇంటర్ పరీక్షలకు సర్వం సిద్ధం

- మార్చి 1 నుంచి ఫస్ట్ ఇంటర్ పరీక్షలు
- మార్చి 3 నుంచి సెకండియర్..
- గుంటూరు జిల్లాలో 87 కేంద్రాల్లో నిర్వహణ
- హాజరుకానున్న 71,258 మంది విద్యార్థులు
- ఉదయం 9 గంటల తర్వాత నో ఎంట్రీ



సందేహాల నివృత్తికి ఫోన్ చేయండి

ఆర్ఐఓ కార్యాలయ కంట్రోల్ రూం :
0863-2228528

హాల్‌టికెట్ కోసం వాట్సాప్ నంబర్ :
95523 00009

గుంటూరు ఎడ్యుకేషన్: ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షలకు గుంటూరు జిల్లాలో ఏర్పాట్లు పూర్తయ్యాయి. జిల్లా వ్యాప్తంగా హాజరు కానున్న 71,528 మంది విద్యార్థుల కోసం 87 పరీక్ష కేంద్రాలను అధికారులు సిద్ధం చేశారు. మార్చి ఒకటో తేదీన ప్రారంభం కానున్న ప్రథమ సంవత్సర పరీక్షలకు 35,688 మంది, మార్చి 3వ తేదీన ప్రారంభం కానున్న ద్వితీయ సంవత్సర పరీక్షలకు 35,946 మంది విద్యార్థులు హాజరు కానున్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు జరగనుండగా, విద్యార్థులను 8.30 గంటల నుంచి పరీక్ష కేంద్రాల్లోకి అనుమతిస్తారు. దూర ప్రాంతాల్లోని కేంద్రాలకు చేరుకోవడంలో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు ఉదయం 8 గంటల కల్లా విద్యార్థులు కేంద్రాలకు చేరుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. 8.45 గంటలలోపల ఎట్టి పరిస్థితుల్లో పరీక్ష కేంద్రంలో తమకు కేటాయించిన సీటులో కూర్చోవాలని, 9 గంటల తరువాత అనుమతించబోమని ఆర్ఐవో జీకే జుబేర్ స్పష్టం చేశారు.

వాట్సాప్ చేస్తే హాల్‌టికెట్

పరీక్ష ఫీజు చెల్లించిన విద్యార్థులందరికీ హాల్ టికెట్లు జారీ చేసిన ఇంటర్‌బోర్డు హాజరు నిబంధనలతో ముడిపెట్టకుండా విద్యార్థులందరికీ పరీక్ష రాసే అవకాశాన్ని కల్పించింది. అదే విధంగా ఫీజు బకాయిల పేరుతో కళాశాలల యాజమాన్యాలు హాల్ టికెట్లు ఇవ్వకుండా వేధింపులకు పాల్పడుతున్నాయనే ఫిర్యాదులతో ఇంటర్‌బోర్డు సైట్‌తో పాటు ప్రభుత్వ సేవల వాట్సాప్ నంబరు నుంచి హాల్ టికెట్లు పొందే అవకాశం కల్పించారు. అదే విధంగా హాల్ టికెట్లపై సంబంధిత కళాశాల ప్రిన్సిపాల్ సంతకం అవసరం లేదని ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిన 95523 00009 నంబరుకు వాట్సాప్‌లో హాయ్ అని మెసేజ్ చేసి విద్యాసేవలను ఎంపిక చేసుకుని విద్యార్థి రోల్ నంబరు, పుట్టిన తేదీ వివరాలను నమోదు చేసి హాల్ టిక్కెట్ పొందవచ్చు. దీనిని ప్రింట్ తీసుకుని, నేరుగా పరీక్ష రాసేందుకు వెళ్లవచ్చు. జిల్లాలోని అన్ని పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. పరీక్షల సరళిని ఆర్ఐవో కార్యాలయంతోపాటు ఇంటర్‌బోర్డు నుంచి ప్రత్యక్షంగా పరిశీలించే ఏర్పాట్లు చేశారు.

నాలుగు ఫ్లయింగ్ స్క్వాడ్‌లు

పరీక్షా కేంద్రాల పరిధిలో 144 సెక్షన్ అమలు పరుస్తుండగా, మాల్ ప్రాక్టీసులను నిరోధించేందుకు నాలుగు ఫ్లయింగ్, నాలుగు సిట్టింగ్ స్క్వాడ్స్‌ను ఏర్పాటు చేశారు. ప్రశ్నపత్రాలకు బార్ కోడింగ్ విధానం ఉండటంతో ఎక్కడైనా మాల్ ప్రాక్టీసు, కాపీయింగ్ వంటి ఘటనలు జరిగితే అందుకు బాధ్యులైన వారిని గుర్తించడంతో పాటు కఠిన చర్యలు తీసుకునేందుకు ఇంటర్మీడియెట్ బోర్డు పక్కాగా ఏర్పాట్లు చేసింది. మాల్ ప్రాక్టీసు, కాపీయింగ్ వంటి దుశ్చర్యలకు పాల్పడటం ద్వారా క్రిమినల్ చర్యలతో పరీక్షల నుంచి ఐదేళ్లపాటు డీబార్ అయ్యే పరిస్థితులు తెచ్చుకోవద్దని అధికారులు హెచ్చరిస్తున్నారు. పరీక్షలకు సంబంధించిన సమస్యలు, సందేహాల నివృత్తికి ఆర్ఐవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూం నంబరు 0863-2228528కు ఫోన్ చేయొచ్చని అధికారులు చెప్పారు. జిల్లా కలెక్టర్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన అత్యున్నతస్థాయి కమిటీ ఆధ్వర్యంలో పోలీసు, రెవిన్యూ యంత్రాంగం పరీక్షలను పర్యవేక్షిస్తోంది.

పట్టభద్రుల పిడికిలి

- పోలింగ్‌కు సర్వం సిద్ధం
- నేడు 493 కేంద్రాల్లో ఓటింగ్
- కృష్ణా – గుంటూరు జిల్లాల్లో 3,47,116 మంది ఓటర్లు
- ఎన్నికల సామగ్రి పంపిణీ పూర్తి

సాక్షి ప్రతినిధి, గుంటూరు: కృష్ణా – గుంటూరు జిల్లాల పట్టభద్రుల శాసనమండలి ఎన్నికల పోలింగ్ మరికొద్ది సేపటిలో ప్రారంభం కానుంది. దీనికి సంబంధించి జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లూ పూర్తి చేసింది. కృష్ణా – గుంటూరు జిల్లాల్లో మొత్తం ఓటర్లు 3,47,116 మంది పట్టభద్రులు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఈ ఎన్నికల్లో మొత్తం 25 మంది పోటీలో ఉన్నారు.

ఇద్దరి మధ్యే ప్రధాన పోటీ

ప్రధాన పోటీ కూటమి అభ్యర్థి ఆలపాటి రాజా, పీడీఎఫ్ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావుల మధ్య ఉండనుంది. అధికారాన్ని అడ్డం పెట్టుకుని ఆలపాటి రాజా వ్యూహాలు పన్నినా.. కూటమిలోని ఇతర పక్షాలు సహకరించకపోవడం ఆయనకు మింగుడు పడని అంశం. మరోవైపు కేఎస్ లక్ష్మణరావుకు అన్ని వర్గాల నుంచి మద్దతు లభిస్తోంది.

పటిష్ట ఏర్పాట్లు

రెండు జిల్లాల్లోనూ 483 పోలింగ్ కేంద్రాలలో అధికారులు పటిష్ట ఏర్పాట్లు చేశారు. ప్రతి పోలింగ్ కేంద్రానికి ఓ మైక్రో అబ్జర్వర్‌ను నియమించారు. వెబ్ కాస్టింగ్, వీడియోగ్రఫీ చేయనున్నారు. 140 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టారు. గురువారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరుగుతుందని ఎన్నికల సంఘం ప్రకటించింది.

గుర్తింపు కార్డు తప్పనిసరి

ఓటేసేందుకు వెళ్లే పట్టభద్రులు ఎన్నికల సంఘం నిర్దేశించిన పది గుర్తింపు కార్డుల్లో ఏదో ఒకటి కలిగి ఉండాలి. ఆధార్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ, ప్రైవేటు, విద్యాసంస్థల ఉద్యోగుల గుర్తింపు కార్డు, ప్రజాప్రతినిధులకు ప్రభుత్వం జారీ చేసిన గుర్తింపు కార్డు, విభిన్న ప్రతిభావంతులకు జారీ చేసిన గుర్తింపు కార్డులలో ఏదో ఒకటి వెంట తీసుకెళ్లాలి. పోలింగ్ కేంద్రాలలోకి సెల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి లేదు.

పోలింగ్ కేంద్రాల వద్ద ప్రచారం నిషేధం

ఓటర్లకు పోలింగ్ బూత్ వివరాలను తెలియచేయటానికి ప్రతి తహసీల్దార్ కార్యాలయంలోనూ ఉద్యోగులు అందుబాటులో ఉండేలా ఏర్పాటు చేశారు. పోలింగ్ రోజు అభ్యర్థులు పోలింగ్ కేంద్రాల వద్ద ప్రచార కార్యక్రమాలు నిర్వహించరాదని ఎన్నికల సంఘం ఆదేశించింది. అయితే కూటమి అభ్యర్థి ఆలపాటి రాజా వర్గీయులు ఈ నిబంధనను ఉల్లంఘిస్తున్నారని పీడీఎఫ్ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావు ఎన్నికల ఏజెంట్ ఎన్నికల కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. ఓటరు సహాయ కేంద్రాల పేరుతో పోలింగ్ కేంద్రాల వద్ద భారీ టెంట్లు వేసి ల్యాప్‌టాప్‌లతో కూర్చుని ఆలపాటి పేరు, ఫొటో, బ్యాలెట్ ప్రదర్శిస్తున్నారని పేర్కొన్నారు.

పకడ్బందీగా పోలింగ్ నిర్వహణ : కలెక్టర్

ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ పకడ్బందీగా నిర్వహిస్తామని రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి తెలిపారు. బుధవారం ఏసీ కళాశాలలోని డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో పోలింగ్ మెటీరియల్ పంపిణీని ఆమె పర్యవేక్షించారు. అనంతరం కలెక్టర్ విలేకరులతో మాట్లాడారు. పోలింగ్ సిబ్బంది పారదర్శకంగా పనిచేయాలని సూచించారు. ఓటర్లకు ఇప్పటికే 95శాతం ఓటర్ స్లిప్పుల పంపిణీ పూర్తయినట్టు వెల్లడించారు.

క్లుప్తంగా

స్వామివారి సేవలో మంత్రి అనగాని



స్వామికి పట్టువస్త్రాలు తీసుకొస్తున్న మంత్రి అనగాని సత్యప్రసాద్

రేపల్లె రూరల్: మహా శివరాత్రిని పురస్కరించుకుని అరవపల్లి గ్రామంలో వేంచేసియున్న బాల కోటేశ్వరస్వామి ఆలయంలో రాష్ట్ర మంత్రి అనగాని సత్యప్రసాద్ బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారికి పట్టువస్త్రాలు సమర్పించి, మొక్కుబడులు తీర్చుకున్నారు. అనంతరం ఆలయ ఆవరణలో అన్నసంతర్పణ, పలు సేవా సంస్థలు ఏర్పాటు చేసిన ప్రసాదాల స్టాళ్లను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పంతాని మురళీధర రావు, తాతా ఏడుకొండలు, కొలసాని రాము, అనగాని శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బెజవాడ దుర్గమ్మకు మంగళగిరి పట్టువస్త్రాలు



మంగళగిరి: మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని బెజవాడ కనకదుర్గ అమ్మ వారికి గుంటూరు జిల్లా మంగళగిరికి చెందిన శ్రీ శివ భక్త మార్కేండేయ వంశీకులు బుధవారం చేనేత పట్టు వస్త్రాలను బహూకరించారు. మంగళగిరిలో భక్త మార్కెండేయ ట్రస్ట్ ఆధ్వర్యంలో చేనేత మగ్గాలపై వారం రోజుల పాటు భక్తిశ్రద్ధలతో ఈ వస్త్రాలను ప్రత్యేకంగా తయారు చేశారు. మహా శివ రాత్రి సందర్భంగా జరిగే శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి కల్యాణ మహోత్సవానికి శివ భక్త మార్కెండేయ వంశీకులు చేనేత పట్టు వస్త్రాలు బహూకరించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ సంవత్సరం ప్రధాన కైంకర్యపరులుగా మార్కెండేయ ట్రస్ట్ వ్యవస్థాపక సభ్యులు చిల్లపల్లి శ్రీనివాసరావు, గౌరి దంపతులు గుత్తికొండ ధనుంజయరావు, విజయ దంపతులు అమ్మ వారికి చేనేత కల్యాణ వస్త్ర నివేదన చేశారు. ట్రస్ట్ చైర్మన్ దామర్ల వెంకట నరసింహం ఆధ్వర్యంలో సభ్యులు చేనేత పట్టు వస్త్రాలు, పసుపు, కుంకుమ, గాజులు విభూది, ఫలపుష్పాలు, తదితరాలను 11 సంప్రదాయ వెదురు పళ్లెంలో దుర్గమ్మ ఆలయానికి చేరుకోగా ఆలయ అసిస్టెంట్ ఈఓ రత్నరాజు మేళతాళాలతో మంగళవాయిద్యాలతో స్వాగతం పలికి అభిషేకాలు నిర్వహించి వేదపండితుల ఆధ్వర్యంలో అమ్మవారికి సమర్పించారు. కార్యక్రమంలో వ్యవస్థాపక ట్రస్టీలు చిల్లపల్లి మోహనరావు, గంజి చిరంజీవి, అందె నాగప్రసాద్, దామర్ల రాజు, శ్యామ్, పూర్ణ, శ్రీనివాసరావు పాల్గొన్నారు.



పుణ్యస్నానాల అనంతరం శివలింగాన్ని పూజిస్తున్న భక్తులు



పుష్కర ఘాట్ వద్ద బందోబస్తు నిర్వహిస్తున్న తాడేపల్లి సీఐ కళ్యాణ్‌రాజు

శివాలయాలకు పోటెత్తిన భక్తులు

- శివపార్వతులకు విశేష పూజలు
- పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు

తాడేపల్లిరూరల్: మహాశివరాత్రి పర్వదిన సందర్భంగా బుధవారం తాడేపల్లి పట్టణ, రూరల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో దేవాలయాలన్నీ శివ నామంతో హోరెత్తాయి. సీతానగరం కృష్ణాతీరంలో పుష్కర్ ఘాట్‌ల వద్ద భక్తులు పుణ్యస్నానాలు ఆచరించేందుకు వేలాదిగా భక్తులు తరలి వచ్చారు. ఘాట్ వద్ద, కొండపైన, మరోవైపు శివాలయాలు ఉండడంతో భక్తులు అధిక సంఖ్యలో శివుడిని దర్శించుకునేందుకు బారులు తీరారు. వారధి వద్ద కృష్ణానదీ తీరంలో ఉన్న శివాలయంలో శివరాత్రి మహోత్సవాలు నిర్వహించారు. భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి శివపార్వతులను దర్శించుకున్నారు. తాడేపల్లి పట్టణ పరిధిలో సోమేశ్వరాలయం, బాలా త్రిపుర సుందరి తాండవేశ్వర దేవస్థానం, ఉండవల్లి, కొలనుకొండ, ఇప్పటం, గుండిమెడ, చిర్రావూరు, పెనుమాక తదితర గ్రామాల్లో శివాలయాల్లో శివరాత్రి వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు.



కృష్ణానదిలో పుణ్యస్నానాలు ఆచరించడానికి వచ్చిన భక్తులు

జంగాల సందడి.....

తాడేపల్లి కృష్ణానదీ తీరంలో జంగాలు సందడి చేశారు. తమ పెద్దలకు పిండప్రదానాలు సమర్పించే కుటుంబ సభ్యులను కలసి వారి పెద్దల పేర్ల మీద జంగాలు కథలు చెబుతూ సందడి చేశారు.

చైతన్య తపోవనంలో....

తాడేపల్లి పట్టణ పరిధిలోని సులకపేటలో చైతన్య తపోవనంలో మహాశివరాత్రి సందర్భంగా శివకేశవ క్షేత్రంలో వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించారు. మహాశివరాత్రిని పురస్కరించుకుని మాతా శివానంద ఆధ్వర్యంలో ఏకాదశ పంచామృత రుద్రాభిషేకాలు, 108 స్పటిక లింగాలకు భస్మాభిషేకం నిర్వహించారు.

బాలబాలికలను పనిలో పెట్టుకోవడం నిషేధం

నెహ్రూనగర్: 14 సంవత్సరాలలోపు బాల బాలికలతో పని చేయించుకోవడం చట్టరీత్యా నేరమని, అటువంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని డెప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ గాయత్రీదేవి పేర్కొన్నారు. బుధవారం అరండల్‌పేటలోని ఓ హోటల్‌లో జిల్లా స్థాయి బాలల పంచాయతీ, బాలలతో ముఖాముఖీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ బాలలు పనుల్లో వినియోగించినట్లయితే 6 నెలల నుంచి రెండేళ్ల వరకు జైలు శిక్ష, 20 వేలు నుంచి 50 వేల వరకు జరిమానా విధించే అవకాశం ఉందని చెప్పారు. చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్‌పర్సన్ జి.ఆరోగ్య ప్రమీల మాట్లాడుతూ బాలలందరూ సెల్ ఫోన్స్, సైబర్ క్రైమ్స్, ఆన్‌లైన్ గేమ్స్‌కు దూరంగా ఉండాలని కోరారు. నేటి సమాజంలో బాలలపై అనేక రకాల వివక్ష, వేధింపులు, బాల్య వివాహాలు, బాలికల అక్రమ రవాణా జరుగుతున్నాయని, వీటి గురించి గ్రామాల్లో అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైన ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా బాలల రక్షణ అధికారి సీహెచ్ విజయ్‌కుమార్, ఎంఈఓ అబ్దుల్ ఖుద్దూస్ పాల్గొన్నారు.



సమావేశంలో చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్‌పర్సన్ ఆరోగ్య ప్రమీల

వైద్య కళాశాలకు పూర్వ విద్యార్థుల వితరణ

గుంటూరు మెడికల్: గుంటూరు వైద్య కళాశాల 1983 బ్యాచ్ విద్యార్థులు వైద్య కళాశాలలో అనాటమి లెక్చర్ గ్యాలరీ ఆధునికీకరణ కోసం రూ.25 లక్షలు విరాళంగా అందజేశారు. బుధవారం ప్రముఖ పల్మనాలజిస్ట్, కనుమూరి హాస్పిటల్స్ అధినేత డాక్టర్ కనుమూరి శ్రీనివాస్, విజయవాడకు చెందిన గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ నాగభైరవ తిరుమలరావు వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.వి.సుందరాచారీని కలిసి రూ.25 లక్షల చెక్కు అందజేశారు. డాక్టర్ సుందరాచారీ మాట్లాడుతూ వైద్య కళాశాల అభివృద్ధికి పూర్వ వైద్య విద్యార్థులు చేస్తున్న సేవలు వెలకట్టలేనివని పేర్కొన్నారు. దాతల సాయంతో వైద్య విద్యార్థులకు రూ.80 లక్షలతో రెండు బస్సులు అందుబాటులోకి తీసుకొచ్చినట్లు చెప్పారు. కళాశాలలో అంతర్గత రోడ్ల నిర్మాణం చేశామన్నారు. సుమారు రూ.3 కోట్లకుపైగా దాతలు విరాళాల రూపంలో వైద్య కళాశాల అభివృద్ధికి అందించారని, వారిని ఆదర్శంగా తీసుకుని మరికొంత మంది కళాశాల అభివృద్ధికి విరాళాలు అందించేందుకు ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ శ్రీధర్, డాక్టర్ ప్రభాకర్ పాల్గొన్నారు.



డాక్టర్ సుందరాచారీకి చెక్కు అందజేస్తున్న వైద్య కళాశాల పూర్వ విద్యార్థులు

అమరారామం.. ఆనంద పరవశం



అమరావతిలో భక్తుల పుణ్యస్నానాలు

అమరావతి: బాల చాముండికా సమేత అమరేశ్వర స్వామి దేవస్థానం మహాశివరాత్రి సందర్భంగా బుధవారం జనసంద్రమైంది. రాష్ట్ర నలుమూలల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. వేకువజామున మూడుగంటలకే స్వామికి అభిషేకాలు ప్రాంభమయ్యాయి. అప్పటికే క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులకు ప్రథమ దర్శనం కల్పించారు. అమరేశ్వర స్నానఘట్టంలో భక్తులు పితృకార్యాలు జరిపించుకున్నారు. జంగమదేవర ఆశీర్వచనాలు పొందారు. రాత్రి లింగోద్భవ కాలంలో అర్చకులు మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాన్ని నిర్వహించారు. ఈవో సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో భక్తులకు ఉచిత ప్రసాదాన్ని, తాగునీటిని అందించారు. బుధవారం 20 వేల మంది భక్తులు స్వామిని దర్శించుకున్నట్టు అంచనా.

దర్శించుకున్న వీఐపీలు

అమరేశ్వరుని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తులు జ్యోతిర్మయి, సుమతి, రవినాద్ తివారి, రిటైర్డ్ న్యాయమూర్తి శ్యాంప్రసాద్, రాష్ట్రప్రభుత్వసలహాదారుడు ఆర్‌పి ఠాకూర్, డెప్యూటి స్పీకర్ రఘురామకృష్ణంరాజు, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, ఎమ్మెల్యేలు కన్నా లక్ష్మీనారాయణ, భాష్యం ప్రవీణ్, జగన్‌మోహనరావు, పంచాయతీరాజ్ కమిషనర్ కృష్ణతేజ దర్శించుకున్నారు.



అమరేశ్వరస్వామి మూల విరాట్

క్వారీ తిరునాళ్లలో ప్రభల వెలుగులు



క్వారీకి వెళ్తున్న పొట్టేళ్ల ప్రభ



విద్యుత్ వెలుగుల్లో చేబ్రోలు మండలం వడ్లమూడి క్వారీ బాలకోటేశ్వరస్వామి దేవాలయం

చేబ్రోలు: మహాశివరాత్రిని పురస్కరించుకుని వడ్లమూడి క్వారీ తిరునాళ్లలో బుధవారం రాత్రి భారీ విద్యుత్ ప్రభలు ఆకట్టుకున్నాయి. జిల్లాలో కోటప్పకొండ తరువాత ప్రభలకు ప్రసిద్ధి చెందిన చేబ్రోలు మండలం వడ్లమూడి క్వారీ తిరునాళ్లకు ఈ ఏడాది 15 భారీ విద్యుత్ ప్రభలు తరలివచ్చాయి. నారాకోడూరు నుంచి గ్రామ ప్రభ, సెంట్రల్ యూత్, మిత్రమండలి ప్రభలు తరలివచ్చాయి. సుద్దపల్లి, చేబ్రోలు, గొడవర్రు, గుండవరం, వడ్లమూడి, శలపాడు గ్రామాల నుంచి భారీ విద్యుత్ ప్రభలు వచ్చాయి. వివిధ రకాల విద్యుత్ బల్బులతో ఆకర్షణీయంగా విద్యుత్ ప్రభలను తీర్చిదిద్దారు. నారాకోడూరు మీదుగా వడ్లమూడి క్వారీ దేవాలయం వరకు వెళ్లే మార్గాల వద్ద ట్రాఫిక్ అంతరాయం కలగకుండా పోలీసులు తగిన జాగ్రత్తలు తీసుకున్నారు. క్వారీ దేవాలయం వద్ద నారాకోడూరు యాదవ సమాజం ఆధ్వర్యంలో భారీ విద్యుత్ ప్రభ, చేబ్రోలు గ్రామ ప్రభ, సుద్దపల్లి విద్యుత్ ప్రభలను ఏర్పాటు చేశారు. దేవాలయానికి ఎదురుగా గొడవర్రు గ్రామ ప్రభను నిలిపారు.



నారాకోడూరు గ్రామ ప్రభ



గుండవరానికి చెందిన టంకశాల వారి ప్రభ



నారాకోడూరులోని సెంట్రల్ యూత్ ప్రభ



గుండవరం గ్రామ ప్రభ



నారాకోడూరులోని మిత్రమండలి ప్రభ

గోవాడకు పోటెత్తిన భక్తులు



దర్శనం కోసం భక్తుల రద్దీ

అమర్తలూరు (వేమూరు): మండలంలోని గోవాడలో వేంచేసి ఉన్న శ్రీ బాల కోటేశ్వర స్వామి దర్శనం కోసం మహా శివరాత్రి తిరునాళ్లను పురస్కరించుకుని భక్తులు బుధవారం పోటెత్తారు. మంగళవారం అర్ధరాత్రి నుంచి క్యూలైన్లలో వేచి చూసి బుధవారం తెల్లవారు జాము నుంచి స్వామిని దర్శించుకున్నారు. గతంలో కంటే ఈ ఏడాది భక్తుల సంఖ్య పెరిగిందని కార్యనిర్వహణాధికారి బి.అశోక్ కుమార్ తెలిపారు. భక్తులు ప్రభలను వాహనాలకు కట్టి దేవస్థానం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. రాష్ట్ర మంత్రి అనగాని సత్య ప్రసాద్, ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు తదితరులు స్వామి దర్శనం చేసుకున్నారు. కాకతీయ అన్నదాన సత్రం, శ్రీబాల కోటేశ్వర స్వామి పరమేశ్వరి ఆర్యవైశ్య అన్నదాన సత్రం, శ్రీ బాల కోటేశ్వర స్వామి బ్రాహ్మణ అన్నదాన సత్రం, శ్రీలీలాభవాని పద్మశాలీయ బహుత్తమ సంఘం అన్నదాన సత్రం ద్వారా భక్తులకు అన్నదానం చేపట్టారు. స్థానికులు మజ్జిగ పంపిణీ చేశారు. భక్తులకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు వేడుకలను పర్యవేక్షించారు.

రేవేంద్రపాడులో భార్యాభర్తల మృతి

భార్యను చంపి, భర్త ఆత్మహత్యకు పాల్పడినట్లు అనుమానం

తాడేపల్లి రూరల్: కుటుంబ కలహాలతో భార్యాభర్తలు మృతి చెందిన ఘటన దుగ్గిరాల మండలం రేవేంద్రపాడులో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. దుగ్గిరాల ఎస్‌ఐ వెంకటరవి తెలిపిన వివరాలు.. కొల్లిపర మండలం వల్లభాపురానికి చెందిన సురేష్(38), రేవేంద్రపాడుకు చెందిన శ్రావణి(32)లకు తొమ్మిదేళ్ల క్రితం వివాహం అయింది. సురేష్ గత ఏడాది వరకు హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేశాడు. ఏడాది నుంచి రేవేంద్రపాడు వచ్చి ఉంటున్నారు. శ్రావణిపై అనుమానంతో తరచూ భర్త గొడవలు పడేవాడు. ఈ నేపథ్యంలో రాత్రి ఇద్దరు ఘర్షణ పడ్డారు. శ్రావణి చనిపోగా ఒంటిపై దెబ్బలున్నాయి. సురేష్ ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. వీరికి కుమారుడు ఉన్నాడు. ఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసులు మృతదేహాలను తెనాలి ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ఉరి వేసుకున్న సురేష్



మృతి చెందిన శ్రావణి

ఆకట్టుకున్న ప్రభలు



రేపల్లె రూరల్: బాల కోటేశ్వరస్వామి తిరునాళ్లకు వివిధ గ్రామాల నుంచి భక్తులు ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై ప్రభలను ఊరేగింపుగా తీసుకొచ్చారు. కారుమూరులోని అమరలింగేశ్వర స్వామి ఆలయం ఆధ్వర్యంలో రూపొందించిన విద్యుత్ ప్రభ ఆకట్టుకుంది. విద్యుద్దీపాలంకరణలో బాలకోటయ్య ఆలయం కనువిందు చేసింది.

లారీ ఢీకొని యువకుడి దుర్మరణం

కృష్ణలంక(విజయవాడ తూర్పు): లారీ ఢీకొనడంతో యువకుడు మృతి చెందిన ఘటన కృష్ణలంక పీఎస్ పరిధిలోని జాతీయ రహదారిపై రాణిగారితోట వద్ద బుధవారం రాత్రి చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో గుంటూరు జిల్లా పెదకాకాని వెంగళరావునగర్‌లో నివాసం ఉండే సాయి కుమార్ నాయక్(23) అక్కడికక్కడే మృతి చెందాడు. యనమలకుదురులో మహాశివరాత్రి తిరునాళ్ల సందర్భంగా సాయికుమార్ అమ్మమ్మ ఇంటికి అతడి స్నేహితుడు రమేష్‌తో కలిసి వచ్చాడు. బుధవారం రాత్రి తిరుగు ప్రయాణంలో ప్రమాదం జరిగింది. రమేష్ బైక్ నడుపుతుండగా సాయికుమార్ నాయక్ బైక్ వెనుక కూర్చున్నాడు. బెంజిసర్కిల్ నుంచి వారధి వెళ్తున్న లారీ, రవి పబ్లిషర్స్ వద్ద బైక్‌ను ఢీకొనడంతో వెనుక కూర్చున్న నాయక్ అక్కడికక్కడే మృతి చెందాడు. సాయికుమార్ నాయక్ ఈపీఎఫ్ ఆఫీస్‌లో పని చేస్తున్నాడు. సమాచారం అందుకున్న కృష్ణలంక, ట్రాఫిక్ పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. లారీ డ్రైవర్‌ను పోలీసులు అదుపులో తీసుకున్నారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఇళ్లల్లో చోరీలకు పాల్పడే ఇద్దరు దొంగల అరెస్ట్

- దొంగలించిన సొత్తు కొనుగోలు చేసే మరో ఇద్దరూ..
- రూ.రూ.14.65 లక్షల ఖరీదైన బంగారం, వెండి ఆభరణాలు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న చోరీ సొత్తుని పరిశీలిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్

నగరంపాలెం: ఇళ్లల్లో చోరీలకు పాల్పడే ఇద్దరు పాత నేరస్తులను, దొంగలించిన ఆభరణాలను కొనుగోలు చేసే మరో ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఆ నలుగురి వద్ద రూ.14.65 లక్షల ఖరీదైన బంగారం, వెండి సొత్తు స్వాధీనం చేసుకున్నారు. జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలోని హాల్‌లో బుధవారం జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ వివరాలు వెల్లడించారు. గుంటూరు ఆర్టీసీ కాలనీ ఐదో వీధి శివార్లో ఉండే ఏలేశ్వరం బాలసుదర్శన్ శర్మ కుటుంబ సభ్యులతో కలిసి ఈనెల 15న విజయవాడలోని బంధువుల ఇంటి వెళ్లారు. తిరిగి 17వ తేదీ ఉదయం ఇంటికొచ్చారు. ఇంటి తాళం పగిలిపోవడం, పడక గదిలోని లాకర్‌లో దాచిన బంగారం, వెండి వస్తువులు, రూ.35 వేలు, చేతి వాచీ కనిపించలేదు. ఇంట్లో చోరీ జరిగిందని భావించిన బాలసుదర్శన్ శర్మ, పాతగుంటూరు పోలీస్‌స్టేషన్ (పీఎస్)లో ఫిర్యాదిచ్చారు. బాధితుని ఫిర్యాదు మేరకు సీఐ వైవీ.సోమయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. సాంకేతిక పరిజ్ఞానంతో లాలాపేట ఎల్ఆర్ కాలనీ ఐదో వీధికి చెందిన సయ్యద్ నాగూర్‌బాషా, స్వర్ణభారత్ నగర్ మూడో వీధికి చెందిన ఉప్పాల సురేష్‌ను అదుపులోకి తీసుకుని విచారించారు. మంగళగిరి గ్రామీణ పీఎస్ పరిధిలోనూ మరో రెండు చోరీలకు పాల్పడినట్లు విచారణలో వెల్లడైంది. అయితే ఇళ్లల్లో చోరీలకు పాల్పడిన బంగారం, వెండి వస్తువులను స్వర్ణభారతి నగర్ ఐదో వీధికి చెందిన బత్తుల గోపీనాథ్, నల్గొండ జిల్లా పియాంపల్లి మండలం రంగారెడ్డిగూడెం గ్రామవాసి ఊరాది జనార్ధన్‌లకు విక్రయించారని గుర్తించారు. దీంతో నాగూర్‌బాషా, సురేష్, గోపీనాథ్, జనార్ధన్‌లను అరెస్ట్ చేశామన్నారు. వీరి నుంచి రూ.14.65 లక్షల ఖరీదైన 134 గ్రాముల బంగారం, 2,889 గ్రాముల వెండి సొత్తు, రూ.10 వేలు స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. సమావేశంలో జిల్లా ఏఎస్పీ కె.సుప్రజ(క్రైం), తూర్పు డీఎస్పీ షేక్ అబ్దుల్‌అజీజ్, పాత గుంటూరు సీఐ వైవీ సోమయ్య పాల్గొన్నారు.

వారాంతపు ప్రత్యేక రైలు

లక్ష్మీపురం: దక్షిణ మధ్య రైల్వే గుంటూరు డివిజన్ మీదుగా చర్లపల్లి- కాకినాడ టౌన్- చర్లపల్లి- నరసాపూర్ మీదుగా ప్రయాణికుల సౌకర్యార్థం వారంతపు ప్రత్యేక రైలు కేటాయించినట్లు డివిజన్ సీనియర్ డీసీఎం ప్రదీప్ కుమార్ బుధవారం తెలిపారు. రైలు నంబర్ 07031 చర్లపల్లి- కాకినాడ టౌన్ రైలు ఈనెల 28వ తేదీ మార్చి 7, 13, 21, 28వ తేదీలలో ప్రత్యేక రైలు కేటాయించడం జరిగిందని చెప్పారు. ఈ రైలు చర్లపల్లి స్టేషన్ నుంచి ప్రతి శుక్రవారం సాయంత్రం 7.20 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 4.30 గంటలకు కాకినాడ టౌన్ స్టేషన్‌కు చేరుకుంటుందని తెలిపారు. రైలు నంబర్ 07032 కాకినాడ టౌన్- చర్లపల్లి రైలు మార్చి 2, 9, 16, 23, 31వ తేదీలలో ప్రత్యేక రైలు కేటాయించడం జరిగిందని ఈ రైలు కాకినాడ టౌన్ స్టేషన్ నుంచి ప్రతి ఆదివారం సాయంత్రం 6.55 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 6.50 గంటలకు చర్లపల్లి స్టేషన్‌కు చేరుకుంటుందని చెప్పారు. రైలు నంబర్ 07233 చర్లపల్లి- నరసాపూర్ రైలు ఈనెల 28, మార్చి 7, 13, 21, 28వ తేదీలలో ప్రత్యేక రైలు కేటాయించడం జరిగిందని ఈ రైలు చర్లపల్లి స్టేషన్ నుంచి ప్రతి శుక్రవారం రాత్రి 8.15 గంటలకు బయలు దేరి నరసాపూర్ స్టేషన్‌కు ఉదయం 5.50 గంటలకు చేరుకుంటుందని తెలిపారు. రైలు నంబర్ 07234 నరసాపూర్- చర్లపల్లి రైలు మార్చి 3, 9, 16, 23, 31వ తేదీలలో ప్రత్యేక రైలు కేటాయించడం జరిగిందని వివరించారు. ఈ రైలు ప్రతి ఆదివారం రాత్రి 8 గంటలకు నరసాపూర్ స్టేషన్ నుంచి బయలుదేరి మరుసటి రోజు ఉదయం 6 గంటలకు చర్లపల్లి స్టేషన్‌కు చేరుకుంటుందని తెలిపారు.